




WWW.VIJAYAKERATAM.COM RNI: APTEL/2010/34724

# విజయకెరటం

తెలుగు దినపత్రిక

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY








సెప్టెంబర్ 1 సోమవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 209 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : యం.డి.మక్సుద్ అహ్మద్

TUESDAY SEPTEMBER 1 2026 | VOL:18 | ISSUE: 209 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:MD. MaKsood Ahmed


## రాహుల్‌ను ప్రధాని అభ్యర్థిగా ఒప్పుకోకుంటే రాజీనామా చేస్తాం.. విజయ్ పార్టీకి కాంగ్రెస్ అల్టిమేటం

**2029 ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీని అంగీకరించాలని టీవీకేకి కాంగ్రెస్ హుకుం**

**సీఎం విజయ్‌ను తదుపరి ప్రధానిగా టీవీకే నేతలు ప్రచారం చేయడమే వివాదానికి కారణం**

**తమ ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతుతోనే టీవీకే ప్రభుత్వం ఏర్పడిందని కాంగ్రెస్ స్పష్టీకరణ**

**లోక్‌సభ ఎన్నికలకు మూడేళ్ల సమయం ఉండగానే కూటమిలో మొదలైన రాజకీయ వేడి**



తమిళనాడులో అధికార సంకీర్ణ ప్రభుత్వంలో

(మిగతా 2వ పేజీలో..)

## విజయ్ ప్రధాని అభ్యర్థిత్వం రగడ.. కాంగ్రెస్, డీఎంకే నేతల ఫైర్

**2029లో విజయ్ ప్రధాని అభ్యర్థి అంటూ టీవీకే ప్రచారం**

**దీనిపై డీఎంకేతో పాటు మిత్రపక్షం కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం**

**మా పీఎం అభ్యర్థి రాహుల్ గాంధీనేనని స్పష్టం చేసిన కాంగ్రెస్**

తమిళనాడులో అధికార టీవీకే (తమిళిగ వెట్రి కళగం) పార్టీ, ముఖ్యమంత్రి విజయ్‌ను 2029 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రస్తావిస్తుండడం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. దీనిపై డీఎంకేతో పాటు మిత్రపక్షమైన కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా స్పందిస్తూ, వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ఒకవేళ ఇదే ప్రచారం కొనసాగితే మంత్రివర్గం నుంచి

(మిగతా 2వ పేజీలో..)



# కేసీఆర్‌పై రేవంత్ సమరశంఖం!

### "రాజీనామా చేయాలి.. ఆరు రోజులు ఆందోళనలు చేయాలి"

**హైదరాబాద్, ఆగస్టు 31:**

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్ నాయకత్వంలోని గత ప్రభుత్వ పాలనపై విమర్శలు గుప్పిస్తూ.. తనకు, కేసీఆర్‌కు పోలికే లేదని అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కుటుంబ సభ్యులు, బంధువులకు పదవులు కట్టబెట్టారని ఆరోపించారు. తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాధాన్యం కల్పించామని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏం జరిగింది.. తమ ప్రభుత్వం రెండున్నరేళ్లలో ఏం చేసిందనే అంశంపై అసెంబ్లీలో చర్చకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. ముసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జిని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

ముసారాంబాగ్ బ్రిడ్జి పూర్తి

హైదరాబాద్‌లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల విస్తరణ జరగాల్సి ఉందని సీఎం అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ముసారాంబాగ్ వంతెనను ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లలోనే బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేశామని తెలిపారు. నగర అభివృద్ధిలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగుతున్నామని చెప్పారు.

తెలంగాణను మూడు భాగాలుగా అభివృద్ధి

రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం తెలంగాణను మూడు భాగాలుగా

(మిగతా 2వ పేజీలో..)



## అమెరికాతో ఉద్రిక్తతలు: భారత్ సాయం కోరిన ఇరాన్ అధ్యక్షుడు

**ప్రధాని మోదీతో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ప్రత్యేక భేటీ**

**ఉద్రిక్తతలు తగ్గించడానికి భారత్ తన పలుకుబడిని ఉపయోగించాలని విజ్ఞప్తి**

**శాంతి స్థాపనకు కృషిని ముమ్మరం చేయాలని నేతల నిర్ణయం**

**కష్టకాలంలో అండగా నిలిచినందుకు భారత్‌కు ఇరాన్ ధన్యవాదాలు**

అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తున్న ఇరాన్-అమెరికా వివాదం పరిష్కారానికి భారత్ చొరవ చూపాలని ఇరాన్ నాయకత్వం అభ్యర్థించింది. కిర్గిజ్‌స్థాన్ వేదికగా



(మిగతా 2వ పేజీలో..)

## 'పుట్టింటి నుంచే బయటకు పంపారు'.. సభలో బోరున విలపించిన కవిత

**బీఆర్ఎస్ సస్పెన్షన్‌పై భావోద్వేగానికి గురైన కవిత**

**సభలో కన్నీటి పర్యంతమైన కవిత**

**"కవిత సీఎం" అంటూ కార్యకర్తల నినాదాలు**

**కొత్త పార్టీ పెట్టడానికి కారణాలు వివరించిన కవిత**

**తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో సమాధానమిస్తామని ప్రతిన**

బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేయడంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు



(మిగతా 2వ పేజీలో..)

## ఏపీలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం.. రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఫైర్

**వెలిగొండకు కృష్ణా జలాల తరలింపుపై రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు విమర్శలు**

**తెలంగాణ ప్రాజెక్టులు ఎండిపోతున్నా ఏపీకి నీళ్లు ఇస్తున్నారని ఆరోపణ**

**కృష్ణా బోర్డు ప్రేక్షకపాత్ర పోషిస్తోందని హరీశ్ రావు ఆక్షేపణ**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్ రావు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషించడం తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని ఆయన విమర్శించారు. ఈ మేరకు సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన తన

(మిగతా 2వ పేజీలో..)



## పౌరసేవల్లో డేటా అనలటిక్స్.. పాలనలో కొత్త శకానికి చంద్రబాబు శ్రీకారం



**రియల్ టైమ్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష**

**పారిశుధ్యంపై రాజీ లేదని, సంక్షేమ హాస్టళ్లలో నెలకోసారి పేరెంట్స్ మీటింగ్ పెట్టాలని సూచన**

**ప్రభుత్వ శాఖల సేవలు, ధ్రువపత్రాల జారీ మొత్తం ఆన్‌లైన్‌లోనే జరగాలని నిర్దేశం**

**వెలిగొండ తరహాలో ప్రతి కార్యక్రమంలో ప్రజా భాగస్వామ్యం పెంచాలని పిలుపు**

**నిరుపయోగంగా ఉన్న 5.70 లక్షల ఎకరాల భూమిని సద్వినియోగం చేసుకోవాలని ఆదేశాలు**

ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాలు, డేటా అనలటిక్స్‌ను విశ్లేషించడం ద్వారా ప్రభుత్వ శాఖలు అందించే

(మిగతా 4వ పేజీలో..)

## ఒక్కరి దానం.. వేలమందికి నీడనిచ్చే మహావృక్షం: మంత్రి నారా లోకేశ్

"ఒక వ్యక్తి చేసిన దానం.. నేడు వేల మందికి నీడనిచ్చే మహావృక్షంగా మారింది. సివిల్ సొసైటీ, ప్రభుత్వం, అధికారులు కలిసి పనిచేస్తే ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చో ఈ ప్రాంగణమే ఒక చక్కటి ఉదాహరణ" అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇవాళ విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం గంభీరంలో ఆయన పలు సేవా, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హరే కృష్ణ వైకుంఠం కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ప్రేమ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ నూతన కాలేజీ భవనాన్ని, ఏజ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెరియాట్రిక్ అండ్ పాలియేటివ్ కేర్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సంస్థకు సహకరిస్తున్న ముఖ్య దాతలతో బోర్డ్‌రూమ్ సమావేశంలో పాల్గొన్నారు.

సేవే పరమావధిగా సాగిన జీవితం

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. దివంగత 'పద్మశ్రీ' డాక్టర్ ఎస్.వి. ఆదినారాయణరావు గారు, వారి కుటుంబం సమాజ సేవ కోసం ఆరు ఎకరాల భూమిని కేటాయించడం ఎంతో అభినందనీయమన్నారు. ఆ భూమిలో నేడు కాలేజీ, హరేకృష్ణ మిషన్ ద్వారా మధ్యాహ్న భోజన కార్యక్రమం, వృద్ధుల సంరక్షణ కేంద్రం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని కొనియాడారు. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేస్తున్న ఈ రోజుల్లో,



(మిగతా 4వ పేజీలో..)

విజయకేతనం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# సమాజాన్ని దెబ్బతీస్తున్న కొత్త వ్యసనం

డేటింగ్ యాప్‌లు ఆధునిక సాంకేతికత యొక్క వరంగా ప్రారంభమయ్యాయి. దూరాలు తగ్గించి, జీవిత భాగస్వామిని కనుగొనేందుకు సులభమైన మార్గంగా ప్రచారం చేశారు. కానీ ఈ యాప్‌లు సమాజంపై వేస్తున్న చెడు ప్రభావం రోజురోజుకీ పెరిగిపోతోంది. అవి మానవ సంబంధాలను వాణిజ్యపరమైన వ్యవహారాలుగా మార్చేస్తున్నాయి.

**మొదటి దెబ్బ.**

ఒకప్పుడు ప్రేమ, వివాహం కుటుంబాలు, స్నేహితులు, సామాజిక పరిచయాల ద్వారా ఏర్పడేవి. ఇప్పుడు స్వైప్ ఒక్కటే సరిపోతుంది. ఫోటోలు, బయోడేటాలు ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీనివల్ల వ్యక్తిత్వం, విలువలు, జీవిత దృక్పథం కాకుండా బాహ్య రూపం ప్రధానమైపోయింది. సంబంధాలు తాత్కాలికంగా, అవసరం అయిపోయిన తర్వాత వదిలేసే వస్తువుల్లా మారిపోతున్నాయి. దీని వల్ల భావోద్వేగ శూన్యత, అసంతృప్తి మిగులుతోంది.

**మానసిక ఆరోగ్యం.**

నిరంతరం అన్వేషించడం, మ్యాచ్ రాకపోవడం, రిజెక్షన్‌లు అనేక మందిలో ఆందోళన, నిరాశ, ఆత్మగౌరవం తగ్గడానికి దారితీస్తున్నాయి. ముఖ్యంగా యువతలో ఇది ఆందోళనకరం. యాప్‌లు డోపమైన్ లూప్‌లను సృష్టించి, వ్యసనంలా మారుస్తున్నాయి. దీనివల్ల నిజజీవితంలో సామాజిక నైపుణ్యాలు క్షీణిస్తున్నాయి. ఫేస్ టు ఫేస్ మాట్లాడటం, సహనం, సమయం ఇవ్వడం వంటి లక్షణాలు తగ్గిపోతున్నాయి.

**కుటుంబ వ్యవస్థపై ప్రభావం.**

అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో వివాహాలు ఆలస్యం అవుతున్నాయి లేదా తగ్గుతున్నాయి. హుక్‌అప్ కల్చర్ పెరగడం వల్ల స్థిరమైన సంబంధాలు, పిల్లల పెంపకం వంటి బాధ్యతలపై ఆసక్తి తగ్గుతోంది. ఇది దీర్ఘకాలంలో జనాభా, సామాజిక స్థిరత్వంపై ప్రభావం చూపుతుంది. స్త్రీలు, పురుషులు ఇద్దరూ అనే భ్రమల్లో పడి, ఎవరినీ సరిగా ఎంచుకోలేకపోతున్నారు. భారత దేశంలో డేటింగ్ యాప్ లు ఎక్కువగా ఉపయోగించే నగరాల్లో బెంగుళూరు మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో హైద్రాబాద్ ఉంది. ఈ డేటింగ్ యాప్ ల వల్ల సమాజం లో అక్రమ, అనైతిక సంబంధాలు పెరిగిపోతున్నాయి. దేవిని వల్ల కుటుంబ వ్యవస్థ దెబ్బతింటోంది. పరాయి వాళ్ళ మోజులో పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ధనార్జనే ధ్యేయంగా యాప్ ల నిర్వాహకులు యువత ను రెచ్చగొడుతున్నారు. కోట్ల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు.

**భద్రత, మోసాలు.**

క్యాట్‌ఫిషింగ్, నకిలీ ప్రొఫైల్‌లు, డబ్బు మోసాలు, లైంగిక దోపిడీలు పెరిగాయి. మహిళలు ప్రత్యేకంగా భద్రతా ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. యాప్‌లు లాభాల కోసం యూజర్ ఎంగేజ్‌మెంట్‌ను పెంచుతాయి కానీ వినియోగదారుల భద్రతను తగినంతగా కాపాడవు. ఇది కేవలం వ్యక్తిగత ఎంపిక కాదు. సమాజం మొత్తం మీద ప్రభావం చూపుతోంది. సంబంధాలను "మార్కెట్"గా మార్చి.. మనుషులను "ప్రొడక్ట్‌లు"గా చూసే మనస్తత్వాన్ని పెంచుతోంది. సాంకేతికత మన జీవితాలను సులభతరం చేయాలి, కానీ మానవత్వాన్ని, సంబంధాల లోతును తగ్గించకూడదు. డేటింగ్ యాప్‌లు పూర్తిగా నిషేధించాలని కాదు. కానీ వాటిని ప్రభుత్వాలు నియంత్రించాలి. దుష్ప్రభావాలను గుర్తించి, యువతలో అవగాహన పెంచాలి. నిజమైన సంబంధాలు సమయం, సహనం, పరస్పర గౌరవం, బాధ్యత అవసరం. సమాజం ఈ వాస్తవాన్ని గుర్తించి, సాంకేతికతను నియంత్రితంగా ఉపయోగించాలి. లేకపోతే ఒంటరి తనం, అస్థిర సంబంధాలు, బలహీన కుటుంబాలు మన భవిష్యత్తు అవుతాయి.

**- సమీ, సీనియర్ జర్నలిస్ట్.**

# కేసీఆర్‌పై రేవంత్ సమరశంఖం!

**మొదటి పేజీ తరువాయి)**

విభజించి ప్రణాళికలు రూపొందిస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలో నివసించే ప్రజల పరిస్థితులు దయనీయంగా ఉన్నాయని, వరదల సమయంలో వారు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవనం, నగర మౌలిక వసతుల విస్తరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

చెరువుల ఆక్రమణలపై చర్యలు

బతుకమ్మకుంటను గత పాలకులు ఆక్రమించారని సీఎం ఆరోపించారు. బతుకమ్మ నిమజ్జనానికి చెరువు లేకుండా కబ్జాకు గురైన ప్రాంతాన్ని హైడ్రా చర్యల ద్వారా తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. చెరువుల్లో ఆక్రమణలను తొలగిస్తున్నామని, ప్రజా ఆస్తులను పరిరక్షించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

"వెయ్యి రోజుల్లో ఎంతో చేశాం"

ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుందని రేవంత్‌రెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూసి ఆశ్చర్యపోయామని అన్నారు. తెలంగాణను అప్పులకుప్పగా మార్చారని గత ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. గత పదేళ్లలో భారీగా అప్పులు చేశారని, వాటి అసలు, వడ్డీల చెల్లింపులకు ప్రతి నెలా వేల కోట్ల రూపాయలు వెచ్చించాల్సి వస్తోందని పేర్కొన్నారు.

ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు

ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామని సీఎం తెలిపారు. పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపుపైనా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. గతంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందేవి కావని, ప్రస్తుతం సమయానికి చెల్లిస్తున్నామని చెప్పారు.

72 వేలకుపైగా ఉద్యోగాల భర్తీ

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రేవంత్‌రెడ్డి అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగ నియామకాలు జరగలేదని విమర్శిస్తూ.. తమ ప్రభుత్వం రెండేళ్లలో 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టిందని తెలిపారు.

రైతు.. మహిళకు అండగా

రైతుల సంక్షేమానికి రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు సీఎం వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు ఆర్టీసీకి రూ.11 వేల కోట్లు చెల్లించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది మందికి సన్నబియ్యం అందిస్తున్నామని, పేదలకు ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. రేషన్ కార్డుల విషయంలో గత ప్రభుత్వంపై ప్రశ్నలు సంధించారు.

కేసీఆర్ రాజీనామాకు పిలుపు

ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ప్రజా సమస్యలపై స్పందించడం లేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. వెయ్యి రోజుల పాలనలో కేసీఆర్ ఒక్కసారైనా ప్రజల మధ్యకు వచ్చారా? అని ప్రశ్నించారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా ప్రభుత్వం నుంచి వేతనం పొందుతున్నారని ప్రస్తావిస్తూ.. లిలికేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన, తమ ప్రభుత్వ పాలనపై అసెంబ్లీలో బహిరంగ చర్చకు సిద్ధమని సీఎం సవాల్ విసిరారు. "రేపటి నుంచి ఆరు రోజులపాటు ప్రధాన ప్రతిపక్ష నేత రాజీనామా చేయాలంటూ ఆందోళనలు చేయా"లిలి అని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## 'పుట్టింటి నుంచే బయటకు పంపారు'.. సభలో బోరున విలపించిన కవిత

**మొదటి పేజీ తరువాయి)**

కవిత భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ కోసం తనను జైలుకు పంపారని పెద్ద నాయకులే చెప్పారని గుర్తు చేశారు. ఆ తర్వాత అదే పార్టీ నుంచి తనను బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. "నాతో ఎందుకు ఇలా చేయాలి?" అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. నిజామాబాద్‌లో నిర్వహించిన తన పార్టీ పాంచజన్య సభలో కవిత మాట్లాడారు. సొంతంగా పార్టీ పెట్టిన తర్వాత తొలిసారి నిజామాబాద్ గడ్డపై అడుగుపెట్టిన ఆమె.. బీఆర్‌ఎస్ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. కన్నీళ్లు పెట్టుకున్నంత మాత్రాన తాను పిరికిదాన్ని కాదన్నారు. అవి బాధ, ఆవేశంతో వచ్చిన కన్నీళ్లని చెప్పారు.కవిత బోరున విలపించడంతో సభలో ఉన్న మహిళలు సైతం కంటతడి పెట్టుకున్నారు. కార్యకర్తలు "కవిత సీఎం.. సీఎం" అంటూ నినాదాలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు. తెలంగాణలో ఇంకా ఎన్నో మంచి పనులు చేయాల్సి ఉందని కవిత చెప్పారు. అందుకే కొత్త పార్టీ పెట్టానన్నారు. తనను పుట్టింటి నుంచి బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఆర్నెల్లు జైలులో ఉండి వచ్చినప్పుడు పుట్టినిల్లు ఆదరించలేదన్నారు. అదే సమయంలో తన అత్తమామలు ఒక్క మాట కూడా అనకుండా కడుపులో పెట్టుకుని కన్నబిడ్డలా చూసుకున్నారని చెప్పారు.ఏ తప్పూ చేయని తనను తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో గెలుపుతో సమాధానం చెబుతానన్నారు. రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కొత్త రాజకీయ శక్తి అవసరమని పేర్కొన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికైనా నీళ్లు వచ్చాయా? అని ప్రశ్నించారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన వారిని నిలదీసేందుకు బీఆర్‌ఎస్ ఎందుకు వెనక్కి తగ్గుతోందని ప్రశ్నించారు. తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డనని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని ప్రజలను కోరారు.

## విజయ్ ప్రధాని అభ్యర్థిత్వం రగడ.. కాంగ్రెస్, డీఎంకే నేతల ఫైర్

**మొదటి పేజీ తరువాయి)**

వైదొలిగేందుకైనా వెనుకాడబోమని కాంగ్రెస్ హెచ్చరించడంతో ఈ వివాదం మరింత ముదిరింది.ఇటీవల తిరుప్పూర్‌లో నిర్వహించిన ఒక సమావేశంలో టీవీకే సీనియర్ నేత, రెవెన్యూ శాఖ మంత్రి కే.ఏ. సెంగొట్టయన్ మాట్లాడుతూ, విజయ్ కేవలం తమిళనాడుకే పరిమితం కాదని, దేశాన్ని సమర్థవంతంగా నడిపించగల సత్తా ఉన్న నాయకుడని కొనియాడారు. ఆయన స్థాయి ఎంజీఆర్, జయలలితలను మించి ఉంటుందని ప్రశంసించారు. అంతేకాకుండా, టీవీకే అంతర్గతంగా నిర్వహించిన ఒక సర్వే ప్రకారం ప్రధాని రేసులో నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీ తర్వాత విజయ్ మూడో స్థానంలో ఉన్నారని ఆ పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం చేస్తున్నాయి.ఈ పరిణాలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ లేదా ఇండియా కూటమి తరఫున రాహుల్ గాంధీయే ప్రధానమంత్రి అభ్యర్థి అని ఆ పార్టీ సీనియర్ నేత మాణికం ఠాగూర్ స్పష్టం చేశారు. ఈ నిర్ణయానికి టీవీకే మద్దతు తెలపని పక్షంలో తమిళనాడు మంత్రివర్గం నుంచి కాంగ్రెస్ వైదొలిగే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. మరోవైపు, డీఎంకే నేత భారతి ఈ వ్యాఖ్యలను ఎద్దేవా చేస్తూ, "ఊహలకు హద్దులుండవు, రేపు విజయ్ ఏకంగా ఐక్యరాజ్యసమితి చీఫ్ అవుతారని కూడా అంటారేమో" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.మరో మిత్రపక్షమైన ఎండీఎంకే సైతం ఈ వాదనను వ్యతిరేకించింది. ఇండియా కూటమికి రాహుల్ గాంధీ మాత్రమే ప్రధానమంత్రి అభ్యర్థి అని, టీవీకే నేతలు ఇటువంటి ప్రచారాలను కట్టిపెట్టాలని సూచించింది. వెరసి, '2029లో విజయ్ ప్రధాని' అనే నినాదం తమిళనాడు అధికార కూటమిలో తీవ్ర చర్చకు దారితీయడమే కాకుండా, మిత్రపక్షాల మధ్య పొడచూపిన విభేదాలను బహిర్గతం చేస్తోంది.

## రాహుల్‌ను ప్రధాని అభ్యర్థిగా ఒప్పుకోకుంటే రాజీనామా చేస్తాం.. విజయ్ పార్టీకి కాంగ్రెస్ అల్టిమేటం

**మొదటి పేజీ తరువాయి)**

రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. 2029 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీని అంగీకరించకపోతే, తాము కేబినెట్ నుంచి వైదొలుగుతామని మిత్రపక్షమైన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీని కాంగ్రెస్ మంత్రులు హెచ్చరించారు. ఈ పరిణామం ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.కన్యాకుమారిలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి ఎస్. రాజేశ్ కుమార్ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. "2029లో రాహుల్ గాంధీయే కాంగ్రెస్ ప్రధాని అభ్యర్థి. ఆయనే తదుపరి ప్రధాని అవుతారు. ఒకవేళ ఈ ప్రతిపాదనను టీవీకే అంగీకరించడానికి నిరాకరిస్తే, కేబినెట్‌లో ఉన్న ఇద్దరు కాంగ్రెస్ మంత్రులం తక్షణమే రాజీనామా చేసి బయటకు వస్తాం" అని ఆయన స్పష్టం చేశారు. పార్టీ లక్ష్యం ఇదేనని, కార్యకర్తలందరూ దీనికే ప్రాధాన్యత ఇస్తారని ఆయన అన్నారు.

వివాదానికి కారణమేమిటి?

ఇటీవల కాలంలో పలువురు టీవీకే నేతలు తమ అధినేత, సీఎం విజయ్‌ను జాతీయ స్థాయి నేతగా, భవిష్యత్ ప్రధానిగా అభివర్ణించడమే ఈ వివాదానికి ఆజ్యం పోసింది. మానవ వనరుల శాఖ మంత్రి డి. శరత్‌కుమార్ ఏకంగా అసెంబ్లీలోనే మాట్లాడుతూ "విజయ్ తదుపరి భారత ప్రధాని" అని వ్యాఖ్యానించారు. మరో మంత్రి, ఆధవ్ అర్జున మాట్లాడుతూ దేశానికి దక్షిణాది నుంచి ప్రధాని రావాల్సిన అవసరం ఉందని వాదించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే ఘనవిజయం తర్వాత విజయ్ నాయకత్వంపై జాతీయ స్థాయిలో ఆసక్తి పెరుగుతోందని మరికొందరు టీవీకే నేతలు పేర్కొంటున్నారు. ఈ ప్రచారమే కాంగ్రెస్ పార్టీకి తీవ్ర ఆగ్రహం తెప్పించింది.

కాంగ్రెస్ బలం.. వైఖరి

టీవీకే నేతల వ్యాఖ్యలపై కాంగ్రెస్ గట్టిగా స్పందించింది. 2029 ఎన్నికలకు రాహుల్ గాంధీ మాత్రమే తమ ఏకైక జాతీయ అభ్యర్థి అని ఉన్నత విద్యాశాఖ మంత్రి పి. విశ్వనాథన్ సహా పలువురు కాంగ్రెస్ నేతలు పునరుద్ఘాటించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో హంగ్ ఏర్పడినప్పుడు, ఐదుగురు ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ మద్దతుతోనే టీవీకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. ఈ మద్దతు కారణంగానే దాదాపు ఆరు దశాబ్దాల తర్వాత కాంగ్రెస్ పార్టీకి తమిళనాడు కేబినెట్‌లో చోటు దక్కింది. ఈ రాజకీయ బలాన్నే కాంగ్రెస్ ఇప్పుడు గుర్తు చేస్తోంది. 2024లో నటుడు విజయ్ ప్రారంభించిన టీవీకే పార్టీ, పోటీ చేసిన తొలి ఎన్నికల్లోనే అనూహ్య విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. అయితే, 2029 లోక్‌సభ ఎన్నికలకు ఇంకా మూడేళ్లకు పైగా సమయం ఉన్నప్పటికీ, ప్రధాని అభ్యర్థిపై ఇప్పటి నుంచే మొదలైన ఈ చర్చలు సంకీర్ణ ప్రభుత్వంలో స్పష్టమైన విభేదాలకు దారితీస్తున్నాయి. ఈ పరిణామాలు రానున్న రోజుల్లో తమిళనాడు రాజకీయాల్లో ఎలాంటి మార్పులకు కారణమవుతాయోనని రాజకీయ విశ్లేషకులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

## ఏపీలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం.. రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఫైర్

**మొదటి పేజీ తరువాయి)**

నిరసనను వ్యక్తం చేశారు.వరద నీరు లేకున్నా, ఎటువంటి కేటాయింపులు లేకుండానే కృష్ణా బేసిన్ వెలుపలి ప్రాంతాలకు ఏపీ ప్రభుత్వం వెలిగొండ ద్వారా నీటిని యథేచ్ఛగా తరలిస్తోందని హరీశ్ రావు ఆక్షేపించారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో సాగునీటి ఎద్దడి ఏర్పడి భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టులు ఎండిపోతుంటే, ఏపీ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలించుకుపోవడం తెలంగాణ రైతాంగ హక్కులపై దాడి చేయడమేనని మండిపడ్డారు.ఇప్పటికే మల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు ద్వారా తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలించుకుపోయిందని, ఇప్పుడు వెలిగొండ వంతు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ ప్రాంత ఆయకట్టుకు నీరందించడంలో విఫలమైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఏపీ చర్యలపై ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. ఇది ఏపీకి పరోక్షంగా సహకరించడమేనని ఆరోపించారు. నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సైతం నిర్లిప్తంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ వివాదంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేఆర్ఎంబీపై ఒత్తిడి తీసుకువచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపేలా చూడాలని, తద్వారా ఆయకట్టుకు నీరందించాలని కోరారు.

## అమెరికాతో ఉద్రిక్తతలు: భారత్ సాయం కోరిన ఇరాన్ అధ్యక్షుడు

**మొదటి పేజీ తరువాయి)**

జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (రాజూ) సదస్సు సందర్భంగా ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ ఉద్రిక్తతలను తగ్గించేందుకు భారత్ తనకున్న దౌత్యపరమైన సంబంధాలను ఉపయోగించాలని ఆయన మోదీని కోరారు.ఈ సందర్భంగా పెజెష్కియాన్ మాట్లాడుతూ.. కష్టకాలంలో తమకు అండగా నిలుస్తున్నందుకు భారత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అమెరికా దౌత్య మార్గాన్ని విడనాడి యుద్ధ మార్గాన్ని ఎంచుకుందని, ఆ దేశంలోని కొన్ని శక్తులు ఈ వివాదం ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. చర్చలు, పరస్పర సహకారంతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్న ఆయన, ఇతర దేశాలు యుద్ధం వైపు వెళ్లకుండా నిరోధించేందుకు భారత్ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.దీనిపై ప్రధానమంత్రి మోదీ స్పందిస్తూ, క్లిష్ట పరిస్థితుల్లోనూ ఇరాన్‌తో భారత్ తన దృఢమైన సంబంధాలను కొనసాగించిందని గుర్తుచేశారు. పెజెష్కియాన్‌ను శాంతికాముకుడిగా అభివర్ణించిన మోదీ, శాంతి స్థాపనలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. కొందరు యుద్ధం ద్వారా లబ్ధి పొందాలని చూస్తారన్న విషయాన్ని అంగీకరిస్తూనే, శాంతిభద్రతల పరిరక్షణ కోసం చేసే ప్రయత్నాలను ముమ్మరం చేయాలని, తుదకు శాంతే విజయం సాధిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. హర్మూజ్ జలసంధిలోని లారక్ ద్వీపంలో ఇరాన్ లాంచర్లపై అమెరికా దాడి చేయడం, దానికి ప్రతిచర్యగా జోర్డాన్‌లోని అమెరికా స్థావరంపై ఇరాన్ క్షిపణులను ప్రయోగించిన మరుసటి రోజే ఈ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. బాహ్య ఒత్తిళ్లు ఉన్నప్పటికీ రవాణా, సముద్రయాన రంగాల్లో భారత్‌తో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఇరాన్ స్పష్టం చేసింది.



# యువత నిరసనలో కొత్త గొంతుక : నేహా బోరా

**(విజయకెరటం ప్రతినిధి- హైదరాబాద్)**

భారతదేశ విద్యా వ్యవస్థలో పేపర్ లీక్స్, అవకతవకలు, జవాబుదారీతనం లేకపోవడం వంటి సమస్యలపై యువత ఆగ్రహం పెరిగిన సమయంలో, ఒక యువతి జాతీయ స్థాయిలో దృష్టిని ఆకర్షించింది. ఆమె నేహా బోరా. జవాహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జీఎన్‌యు)లో పీహెచ్‌డి చేస్తున్న ఈ విద్యార్థిని, ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (AISA) జాతీయ అధ్యక్షురాలు. 2026లో ఢిల్లీ జంతర్ మంతర్‌లో జరిగిన విద్యార్థి ఉద్యమంలో ఆమె 23 రోజులు నిరాహార దీక్ష చేసి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యారు.




### నేపథ్యం, విద్య.

నేహా బోరా ఉత్తరాఖండ్‌లోని ఖతీమా ప్రాంతానికి చెందినవారు. ఆమె తండ్రి భారత సైన్యంలో పనిచేశారు. కాబట్టి, చిన్నతనంలో వివిధ నగరాల్లో తిరుగుతూ పెరిగారు. సిలిగురిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో స్కూలింగ్ పూర్తి చేసిన ఆమె, ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి బీఏ (సోషియాలజీ), అంబేద్కర్ విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ పూర్తి చేశారు. ప్రస్తుతం జీఎన్‌యులోని స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ ఎస్తెటిక్స్‌లో పీహెచ్‌డి పరిశోధన చేస్తున్నారు. నేహా బోరా రంగస్థల కళాకారిణి కూడా. విద్యార్థి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొని ఐసా లో పెరిగి జాతీయ అధ్యక్ష పదవిని చేపట్టారు. ఐసా అనేది కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్-లెనినిస్ట్) లిబరేషన్‌తో అనుబంధం ఉన్న విద్యార్థి సంఘం.

### జంతర్ మంతర్ ఉద్యమం.

2026లో నీట్ (NEET) పరీక్షల్లో పేపర్ లీక్, రద్దు, విద్యార్థుల ఆత్మహత్యలు వంటి సంఘటనలు దేశవ్యాప్తంగా ఆందోళనకు దారితీశాయి. కాక్రోచ్ జనతా పార్టీ (CJP) అనే వ్యంగ్య సామాజిక మాధ్యమ వేదిక ద్వారా ప్రారంభమైన ఈ ఉద్యమం ఢిల్లీ జంతర్ మంతర్‌లో పెద్ద ఉప్పెన గా మారింది. విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం కోసం డిమాండ్ చేస్తూ వేలాది మంది విద్యార్థులు సమావేశమయ్యారు. ఈ ఉద్యమంలో నేహా బోరా కీలక పాత్ర పోషించారు. సోనమ్ వాంగ్‌చుక్, ఇతర ఐసా నాయకులతో కలిసి ఆమె 23 రోజులు నిరాహార దీక్ష చేశారు. దీక్ష ప్రారంభంలో 66 కిలోల బరువు ఉన్న ఆమె దాదాపు 7.5 కిలోలు తగ్గారు. రక్తపోటు, బ్లడ్ షుగర్ స్థాయిలు ప్రమాదకరంగా పడిపోయాయని వైద్యులు హెచ్చరించారు. అయినా ఆమె దీక్ష కొనసాగించారు. జూలై 20న పోలీసుల లాఠీచార్జ్, ఇతర సంఘటనల సమయంలో ఆమె ప్రసంగాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. "మా గాయాలే హింసకు సాక్ష్యం. అన్నీ గుర్తుంచుకుంటాం" అని ఆమె చెప్పిన మాటలు విద్యార్థి లోకాన్ని ప్రభావితం చేశాయి. ఈ ఉద్యమం ఫలితంగా జూలై చివర్లో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. ఉద్యమం విజయం సాధించిన తర్వాత ఆమె జరుపుకున్న సంబరాల వీడియో (నాట్యం చేస్తూ) కూడా చర్చనీయాంశమైంది.

### తదుపరి కార్యకలాపాలు

ఉద్యమం తర్వాత కూడా నేహా బోరా చురుకుగా ఉన్నారు. దేశ వ్యాప్తంగా సభలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం నింపుతున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ లో జరిగిన సభలో ఆమె పాల్గొన్నారు. బీహార్‌లో అరెస్టైన విద్యార్థుల విడుదల కోసం, జార్ఖండ్‌లో ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలపై జరుగుతున్న నిరసనల్లో పాల్గొన్నారు. ఆగస్టు 2026లో రాంచీలో అసెంబ్లీ వైపు నిరసన ర్యాలీ సందర్భంగా ఆమెపై సిరా దాడి జరిగింది. ఆమె "ఈ సిరాను గర్వంగా ధరిస్తాను. దీనితోనే భవిష్యత్తు రాస్తాం" అని స్పందించారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆమె విద్యా వ్యవస్థలోని సమస్యలు వ్యవస్థాగతమైనవని, కేవలం శిక్షలు పెంచడం వల్ల పరిష్కారం కాదని, ఎన్ఈపీ-2020 పూర్తి రద్దు కావాలని వాదిస్తున్నారు. ప్రైవేటీకరణ, విద్యార్థుల హక్కులు, సామాజిక న్యాయం వంటి అంశాలపై కూడా ఆమె గొంతు వినిపిస్తున్నారు.

### ప్రాధాన్యం

నేహా బోరా యువతలోని నిరాశ, ఆగ్రహాన్ని ప్రతిబింబించే గొంతుగా మారారు. +వఅ్గ ఉద్యమాల్లో ఆమె పాత్ర ముఖ్యమైంది. రంగస్థల నేపథ్యం, విద్యార్థి రాజకీయాల అనుభవం, నిర్భయత ఆమెను వేరు చేశాయి. కుటుంబం బీజేపీ మద్దతుదారులుగా ఉన్నప్పటికీ, ఆమె ఎంచుకున్న మార్గం వేరు. ఉద్యమం తర్వాత తల్లి వైఖరి మారినట్లు ఆమె చెప్పుకున్నారు. విద్యా వ్యవస్థలో మార్పుల కోసం పోరాడుతున్న యువతకు ఆమె ఒక ప్రతీకగా నిలుస్తున్నారు. ధైర్య సాహసాలతో పాటు వాక్చాతుర్యమున్న నేహా బోరా భవిష్యత్తులోనూ మంచి నేతగా ఎదుగుతారనే చర్చ దేశ వ్యాప్తంగా సాగుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి నేహా బోరా లు దేశానికి చాలా అవసరం.

# నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లోని అన్ని వార్డుల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని మేయర్.





**నల్లగొండ ఆగస్టు 31 విజయ కెరటం ప్రతినిధి**

ఈరోజు జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల వరకే పార్టీలు అని.. ఆ తర్వాత పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారి సహకారంతో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. తనకు ఏ డివిజన్ పై వివక్షత లేదని... అన్ని డివిజన్ లను అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతిరోజు ఒక వార్డును సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారుకార్పొరేషన్ లో అన్ని డివిజన్లలో వందల రూపాయలతో మిగిలిన సిసి రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయన్నారు. తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు డివిజన్ లలో ఏ సమస్యలు ఉన్నా సమావేశం దృష్టికి, తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

# ప్రజా ఫిర్యాదులపై సత్వర స్పందన.. బాధితులకు న్యాయం చేయాలని అధికారులకు ఎస్పీ ఆదేశం ..

**నల్లగొండ ఆగస్టు 31 విజయకేరటం ప్రతినిధి**

సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ జిల్లాలో వివిద పోలీస్ స్టేషన్ పరిదిలో నుంచి వచ్చిన దాదాపు 34 మంది బాధితులసమస్యలను, ఫిర్యాదులను సవివరంగా విని సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, మోసాలు, ఆస్తి సంబంధిత వివాదాలు తదితర అంశాలపై తమ ఫిర్యాదులను ఎస్పీ గారి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును పరిశీలించిన ఎస్పీ గారు, సంబంధిత పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. బాధితుల ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారణ చేపట్టి, వాస్తవాలను నిర్ధారించిన అనంతరం చట్టపరమైన నిబంధనల ప్రకారం సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయకుండా, ప్రతి కేసు పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖపై నమ్మకంతో వస్తున్నందున, వారి ఫిర్యాదులను గౌరవంగా స్వీకరించి, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ గారు అధికారులకు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను పరిష్కరించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని తెలిపారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా జిల్లా ఎస్పీని కలిసి తమ సమస్యలను వివరించే అవకాశం కల్పిస్తున్నామని, ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించి చట్ట పరిధిలో సత్వర పరిష్కారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ తెలిపారు.



# కలెక్టరేట్లో గ్రీవెన్స్ సందడి





**నల్లగొండ ఆగస్టు 31 విజయ కెరటం ప్రతినిధి**

ఇకపై ప్రజావాణి దరఖాస్తుల తో పాటు, వివిధ పథకాల అమలుపై మండల ప్రత్యేక అధికారులతో ప్రతి సోమవారం లేదా మంగళవారం సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. సమావేశం అనంతరం ఎంఎస్ ఓ లు మండల స్థాయిలో తహసిల్దార్, ఎంపీడీవో, మండలాధికారులు, మున్సిపల్ కమిషనర్ తదితరులతో సమావేశం నిర్వహించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై వారాంతంలోగా నివేదిక సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. జిల్లా ,మండల, డివిజన్ సాయి ప్రజావాణిలలో వచ్చే ఫిర్యాదులపై ఇకపై ప్రత్యేకంగా సమీక్షించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ... పింఛన్లకు సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలని, ఒకవేళ ఎవరైనా ఆన్లైన్ చేయకుండా భౌతికంగా దరఖాస్తులు ఇచ్చినట్లయితే వెంటనే ఆన్లైన్ చేయించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు రోజుల్లో జిల్లాలోని అన్ని మండలాలలో పాఠశాల విద్యార్థులకు యూనిఫార్మ్స్ పంపిణీ చేయాలన్నారు. అలాగే ప్రతి పాఠశాలలో ఇద్దరు టైలర్లు, రెండు మిషన్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు దుస్తులు సరిపోనట్లయితే ఆల్ట్రేషన్ చేయించి ఇవ్వాలని చెప్పారు. త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి నల్గొండ జిల్లాకు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు వారి శాఖకు సంబంధించిన నివేదికలను సిపిఓ కు సమర్పించాలని, అంతేకాక జిల్లా నివేదికతో పాటు, నకిరేకల్ నియోజకవర్గానికి సంబంధించిన నివేదికను ప్రత్యేకంగా రూపొందించి సమర్పించాలని, ఆయా శాఖల అధికారులు ఎప్పటిలాగే వారి శాఖల ద్వారా చేసే ఏర్పాట్లను ఎలాంటి పొరపాట్లు లేకుండా చేయాలని అన్నారు. జిల్లాలో రీసర్వే నిర్వహిస్తున్న గ్రామాలలో అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సంస్థలు, భూములు, ఆస్తులను డీమార్కు చేయించుకోవాలని, ఇది ఆయా శాఖల బాధ్యత అని అన్నారు. సెప్టెంబర్ 1న దేవరకొండలో యు డి ఐ డి కేంద్రాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ మాతృ నాయక్ ను ఆదేశించారు. ప్రముఖులు, వివిఐపి ల ద్వారా వచ్చే లేఖలు, అలాగే దరఖాస్తులపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి వాటిని పరిష్కరించాలని ,పరిష్కరించిన విషయాన్ని సంబంధిత ప్రజాప్రతినిధితో పాటు, దరఖాస్తుదారులకు తెలియజేయాలని కలెక్టర్ చెప్పారు. కాగా ఈ సోమవారం జిల్లాస్థాయి ప్రజావాణిలో రెవెన్యూ శాఖ కు 44, ఇతర శాఖలకు 39 దరఖాస్తులు మొత్తం 83 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ సర్వీస్ నుండి పదవి విరమణ పొందుతున్న జిల్లా సహకార అధికారి పత్యా నాయక్ సేవలను జిల్లా కలెక్టర్ కొనియాడారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, డిఆర్ఓ దశరథ్ ,డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి ,శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, తదితరులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు.

# సయ్యు జాఫర్ సతీమణి అంత్యక్రియలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే





**నల్లగొండ ఆగస్టు 31 విజయ కెరటం ప్రతినిధి**

ఈరోజు సయ్యద్ జాఫర్ సొంత గ్రామము మేళ్లచెరువులో అంత్యక్రియలకు హాజరై నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి వారిని ఓదార్చారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సయ్యద్ ఆషం అడ్వకేట్ మస్యుద్దిన్ మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

## సమస్యలను పరిష్కరించాలి జిల్లా ఎస్పీ నరసింహా

**సూర్యాపేట (విజయ కెరటం స్టేట్ బ్యూరో గౌస్)**

సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నరసింహ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు సూచనలు చేశారు. సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి వచ్చిన అర్జీల తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ కి సూచనలు చేయడం జరిగింది. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవల్ని వినియోగించుకుంటూ,వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని తెలిపారు.



విజయకెరటం
తెలుగు దినపత్రిక

# POCSO కేసులో నిందితుడికి 10 సంవత్సరాల

## కఠిన కారాగార శిక్ష -- రూ.5,000 జరిమానా

- బాధితురాలికి రూ.7 లక్షల పరిహారం

**నల్లగొండ ఆగస్టు 31 విజయ కెరటం ప్రతినిధి**

నల్లగొండ జిల్లా దిండి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన POCSO, అత్యాచారం కేసులో నిందితుడికి నల్లగొండ ఫాస్ట్ ట్రాక్ కోర్టు శిక్ష విధించింది. దిండి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 97/2020గా నమోదైన కేసుకు సంబంధించి SC POCSO No.101/2021 కేసుపై సోమవారం 31-08-2026 నాడు నల్లగొండలోని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఫర్ రేప్ అండ్ POCSO యాక్ట్ కేసులు గౌరవ న్యాయమూర్తి గారు తీర్పు వెలువరించారని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ తెలిపారు. కేసు వివరాల ప్రకారం.. దిండి మండలంలోని ప్రతాప్‌నగర్ గ్రామానికి చెందిన ముదావత్ మల్లేష్, తండ్రి పర్వతాలు, వయస్సు 23 సంవత్సరాలు, ఆటో డ్రైవర్పై దిండి పోలీస్ స్టేషన్‌లో IPC సెక్షన్ 376(2), 506 మరియు POCSO Act-2012లోని సెక్షన్ 5 r/w 6 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి సేకరించిన ఆధారాలు, సాక్ష్యాలను కోర్టులో సమర్పించడంతో పాటు, ప్రాసిక్యూషన్ తరఫున నిందితుడిపై అభియోగాలను సమర్థవంతంగా నిరూపించారు. కేసును విచారించిన గౌరవ న్యాయస్థానం నిందితుడిని IPC సెక్షన్ 376(2) కింద

దోషిగా నిర్ధారించింది.

నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష (RI) విధించింది. రూ.5,000/- జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో 3 నెలల సాధారణ కారాగార శిక్ష (SI) అనుభవించాల్సి ఉంటుంది. బాధితురాలికి రూ.7,00,000/- పరిహారం అందించాలని ఆదేశించింది. ఈ కేసులో దర్యాప్తు అధికారులు దిండి పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎం. రాములు (HC-1887) మొదటి దర్యాప్తు అధికారిగా, దిండి సీఐ డి. వెంకటేశ్వర్లు రెండవ దర్యాప్తు అధికారిగా విధులు నిర్వహించారు. కేసు విచారణలో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్ కుమార్ ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు. అలాగే భరోసా సెంటర్ లీగల్ ఆఫీసర్ శ్రీమతి ఎం. కల్పన బాధితురాలికి అవసరమైన న్యాయ సహకారం అందించారు. కేసు కోర్టు డ్యూటీ నిర్వహణలో హెడ్ కానిస్టేబుల్ కె. కృష్ణ (HC-2165), పి. లింగయ్య (PC-3795), లైజన్ అధికారులుగా హెడ్ కానిస్టేబుల్ పి. నరేందర్ (HC-2053), పి.సి. ఎన్. మల్లికార్జున్ (PC-3224) సమన్వయంతో విధులు నిర్వహించారు. ప్రస్తుతం దిండి ఎస్ఐ చి. బాలకృష్ణ, దిండి సీఐ కె. బీసన్న కేసు సంబంధిత కోర్టు ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా,రాజూరా, మహిళలు మరియు బాలికలపై నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తు, కోర్టు విచారణ ప్రక్రియలను సమర్థవంతంగా కొనసాగిస్తూ, నిందితులకు శిక్షలు పడేలా పోలీస్ శాఖ కృషి చేస్తోంది.

# పేదలకు మెరుగైన కంటి వైద్యం అందించడమే లక్ష్యం





- బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు

**వరంగల్, విజయ కెరటం ఆగస్టు 31:**

పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన కంటి వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఇసుక అడ్డ పోర్ట్ రోడ్ ప్రాంతంలోని రాజశ్రీ గార్డెన్స్‌లో ఎర్రబెల్లి ప్రదీప్ రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్ రావు ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన మహా ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో సుమారు 1,500 మంది పేద, మధ్యతరగతి ప్రజలు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు.

### 1,000 మందికి పైగా ఉచిత అద్దాలు

ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ.. శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో 1,000 మందికి పైగా అవసరమైన కంటి అద్దాలను ఉచితంగా అందించినట్లు తెలిపారు. కంటి రెటీనా సమస్యలు, ఇతర శస్త్రచికిత్సలు అవసరమైన సుమారు 100 మందిని తదుపరి చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు చెప్పారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాల్లో ఇది రెండో విడత అని తెలిపారు. మొదటి విడతలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కాశిబుగ్గలో కంటి వైద్య శిబిరం నిర్వహించగా సుమారు 200 మంది పాల్గొని వైద్య సేవలు పొందారని గుర్తుచేశారు. రెండో విడత శిబిరానికి కూడా ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకోవాలని ప్రదీప్ రావు సూచించారు. ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య పరీక్షలు చేయించుకోలేని పేదలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం, అవసరమైన వారికి అద్దాలు అందించడం, తదుపరి చికిత్సపై వైద్యుల సూచనలు అందించడం సంతృప్తినిచ్చిందన్నారు.ప్రజా సేవే లక్ష్యంగా మరిన్ని కార్యక్రమాలు "ప్రజా సేవే లక్ష్యం.. ఆరోగ్యమే మహాభాగ్యం" అనే సంకల్పంతో భవిష్యత్తులో కూడా మరిన్ని ఉచిత వైద్య సేవా కార్యక్రమాలు నిర్వహించి పేద ప్రజలకు అండగా నిలుస్తామని ఎర్రబెల్లి ప్రదీప్ రావు తెలిపారు. శిబిరానికి విశేష స్పందన చూపిన వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సహకరించిన వారికి ధన్యవాదాలు శిబిరం విజయవంతానికి సహకరించిన శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి, క్రీడో లైఫ్ సైన్స్ డైరెక్టర్ ఆలూరు వంశీకృష్ణకు ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్ రావు ధన్యవాదాలు తెలిపారు. భారీగా పాల్గొన్న బీజేపీ నాయకులు కార్యక్రమంలో మాజీ మేయర్ తక్కెళ్లపల్లి రాజేశ్వరరావు, మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్, మాజీ జిల్లా అధ్యక్షులు రావు పద్మ, ఎడ్ల అశోక్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ, పరకాల నియోజకవర్గ కంటెస్టెడ్ అభ్యర్థి డాక్టర్ కాళీ ప్రసాద్, నర్సంపేట నియోజకవర్గ కంటెస్టెడ్ అభ్యర్థి పుల్లారావు, బీజేపీ కార్పొరేటర్లు దాస్యం అభినవ్ భాస్కర్, గుజ్జుల వసంత మహేందర్, స్థానిక కార్యక్రమ నిర్వాహకులు మందా శ్రీనివాస్, కందిమల్ల మహేష్, సీనియర్ నాయకులు మల్లాడి తిరుపతిరెడ్డి, బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, రాణా ప్రతాప్ రెడ్డి, సముద్రాల పరమేశ్వర్, బైరి మురళీకృష్ణ, పూజారి అజయ్ గౌడ్, కోమాకుల నాగరాజు, బైరి నాగరాజు, కనుకుంట్ల రంజిత్, గోకె వెంకటేష్, ఆకుతోట రాజు, బోరిగం నాగరాజు, తాళ్లపల్లి అర్జున్, రఫీ, విప్ప సుధాకర్, పాలకుర్తి శేఖర్, కట్కూరి రాజేష్, సుధీర్, సాయి, కుమార్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, ఎర్రబెల్లి ప్రదీప్ రావు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కంటి వైద్య శిబిరాన్ని విజయవంతం చేశారు.

# సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణికి ఘన సన్మానం

## వివిధ ప్రజా, కుల సంఘాల నాయకుల మర్యాదపూర్వక భేటీ

**సూర్యాపేట (విజయ కెరటం స్టేట్ బ్యూరో గౌస్)**



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారిణి కే. లతను సోమవారం వివిధ ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులుమర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధికారిణి కే. లతను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అర్హులైన ప్రజలకు అందుతున్న ప్రభుత్వ పథకాలు, సామాజిక వర్గాల సమస్యలు తదితర అంశాలపై చర్చించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేయాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్--ఎంఎస్‌పీ జాతీయ నాయకులు చింతలపాటి చిన్న శ్రీరాములు మాదిగ, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు యాతాకుల రాజన్న మాదిగ, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు బొల్లెద్దు వినయ్, దళిత సామాజిక నాయకులు, పీపుల్ ఫౌండేషన్ చైర్మన్ యాతాకుల సునీల్, నాయి బ్రాహ్మణ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పౌరసేవల్లో డేటా అనలటిక్స్.. పాలనలో కొత్త శకానికి చంద్రబాబు శ్రీకారం

మొదటి పేజీ తరువాయి)

పౌరసేవలను మరింత మెరుగుపరచాలని, అవసరమైన మార్పులు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో 'రియల్ టైమ్ గవర్నెన్స్' (ఆర్టీజీ)పై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం, అల్లూరి విమానాశ్రయం వంటి కార్యక్రమాలకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారని, ఇదే స్ఫూర్తిని ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ కొనసాగించి, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు. రాష్ట్రంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటివరకు తాను 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో 20 సార్లు పాల్గొన్నానని గుర్తుచేశారు. ఇదే క్రమంలో సంక్షేమ హాస్టళ్లలో పారిశుధ్య నిర్వహణను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని నిర్దేశించారు. ప్రతి నెలా మొదటి ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులను హాస్టళ్లకు ఆహ్వానించి, అక్కడి పరిస్థితులు, భోజనం, తాగునీటి సౌకర్యాలపై వివరించాలని సూచించారు. దీనివల్ల పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయన్నారు. అదేవిధంగా అన్నా క్యాంటీన్ల ద్వారా అన్నార్తులకు సాయం అందించే దాతలను గుర్తించి ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వంలోని అన్ని శాఖలు తమ సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే అందించాలని చంద్రబాబు ఆదేశించారు. రెవెన్యూ సహా అన్ని విభాగాలు ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లోనే జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీకృత సేవల విధానం ద్వారా ప్రజలకు వేగంగా నిర్ణయాలు అందేలా చూడాలని అన్నారు. పనితీరు ఆధారంగా జిల్లా, నియోజకవర్గ స్థాయిలో బాధ్యులకు ర్యాంకులు ఇవ్వాలని, లోటుపాట్లను ఎప్పటికప్పుడు సమీక్షించుకుని సరిదిద్దుకోవాలని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగంలో 'అవేర్' (ూాౌూ=జు) వేదిక ద్వారా రాష్ట్రంలోని సాగు పరిస్థితిని ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి, రైతులకు అవసరమైన సూచనలు అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రకృతి సేద్యం చేసే రైతులను పూర్తిస్థాయిలో ప్రోత్సహించాలన్నారు. ఉద్యాన పంటలను కాపాడుకునేందుకు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో నిరుపయోగంగా ఉన్న 5.70 లక్షల ఎకరాల భూమిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే దరఖాస్తుల పరిష్కారంపైనా ప్రత్యేక దృష్టి సారించాలని నిర్దేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి పోర్టల్‌లో అర్జీలను నమోదు చేయాలి

## జిల్లా కలెక్టర్ తేజస్

**సూర్యాపేట (విజయ కెరటం స్టేట్ బ్యూరో గౌస్)**



ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి సోమవారం జరుగు ప్రజావాణి కి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రతి అధికారి తమ లాగిన్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని లేనియెడల వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని,

. ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 36 దరఖాస్తులు, డి పి ఓ 7, మున్సిపాలిటీ 5 , డిఎంహెచ్వో 3, మిగిలిన 19 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 70 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, సిపిఓ కిషన్, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిఎంహెచ్వో వెంకటరమణ, డిపిఓ యాదగిరి, డిడబ్ల్యూఓ నరసింహారావు జిల్లా అధికారులు, తదితరులు హాజరైనారు.

# ఒక్కరి దానం.. వేలమందికి నీడనిచ్చే మహావృక్షం: మంత్రి నారా లోకేశ్

మొదటి పేజీ తరువాయి)

వృద్ధుల కోసం అత్యాధునిక కేర్ సెంటర్ నిర్మించడం గొప్ప విషయమని ప్రశంసించారు.

విలువలతో కూడిన విద్యే లక్ష్యం

"విద్యాశాఖ మంత్రిగా విద్యార్థులకు కేవలం చదువు మాత్రమే కాకుండా, విలువలు, నైతికతతో కూడిన విద్యను అందించాల్సిన బాధ్యత నాపై ఉంది. 'అమ్మకి చెప్పలేని పని ఏదీ చేయొద్దు' అనే బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి మాట ప్రతి ఒక్కరికీ మార్గదర్శకం కావాలి. అందుకే ఆయనకు కేబినెట్ హోదాతో సలహాదారు బాధ్యతలు అప్పగించాం. ఆయన సూచనలతో ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన పుస్తకాలను అందిస్తాం" అని లోకేశ్ వివరించారు. వృద్ధులు గౌరవంగా జీవించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలో ఎక్కడా లేని విధంగా వారికి రూ.4,000 పెన్షన్ అందిస్తున్నారని గుర్తు చేశారు.

విశాఖ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

విశాఖపట్నం అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. "రాష్ట్ర విభజన తర్వాత విశాఖ అభివృద్ధి మనందరి బాధ్యత. ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్లుగా విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను దేశంలోనే తొలి వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మారుస్తాం. కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో విశాఖను దేశంలోనే నంబర్ వన్ సిటీగా తీర్చిదిద్దుతాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ను చంద్రబాబు అభివృద్ధి చేసిన తరహాలోనే విశాఖ అభివృద్ధిలోనూ కొత్త బెంచ్‌మార్క్ సృష్టిస్తామని అన్నారు.

అపోహలు వద్దు.. పర్యావరణ పరిరక్షణే ముఖ్యం

అభివృద్ధి విషయంలో ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని లోకేశ్ అన్నారు. "ప్రజల ప్రయోజనాలకు, ప్రకృతికి వ్యతిరేకంగా ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమం చేపట్టదు. డేటా సెంటర్ల విషయంలో కొన్ని అపోహలున్నాయి. నేను వ్యక్తిగతంగా ఇంటెల్ డేటా సెంటర్‌ను పరిశీలించాను. విశాఖలో ఏర్పాటు చేసే డేటా సెంటర్లలో నీటి వినియోగాన్ని తగ్గించే ఎయిర్ కూలింగ్ వంటి ఆధునిక సాంకేతికతలకు ప్రాధాన్యం ఇస్తాం" అని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అన్ని విషయాల్లో పర్ఫెక్ట్ అని చెప్పడం లేదని, ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని, అవసరమైన చోట సరిదిద్దుకుంటూ ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, విష్ణు కుమార్ రాజు, ఫౌండేషన్ చైర్మన్ రొక్కమ్ శశి ప్రభ, హరే కృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిస్కించన భక్త దాస తదితరులు పాల్గొన్నారు.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528